ప్రజాశక్తి
బుధవారం 27 సెప్టెంబర్ 2023
5
విజయనగరం

నేడు 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-గజపతినగరం

మండల స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం వినతుల స్వీకరణ కార్యక్రమం బుధవారం గజపతినగరంలో జరుగనుంది. మండలపరిషత్ కార్యాలయంలో ఉదయం 10గంటల నుంచి జిల్లాస్థాయి అధికారులంతా పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని కలెక్టర్ నాగలక్ష్మి వెల్లడించారు. ఈ ప్రాంత ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకొనే అవకాశం వుంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా అధికారులతో పాటు అన్ని శాఖల మండల అధికారులు ఈ వినతుల స్వీకరణ కార్యక్రమానికి హాజరై వినతులను పరిష్కరిస్తారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లి ఫిర్యాదులు, వినతులు ఇవ్వాల్సిన అవసరం లేకుండా మండల కేంద్రాల్లోనే ప్రజా సమస్యల పరిష్కారం చేసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని వినియోగించు కోవాలని సూచించారు.

ఎస్ఎఫ్ఐ నాయకులపై పోలీసుల దాష్టీకం

- సమస్యల పరిష్కరించాలని విద్యార్థుల ఆందోళన
- కలెక్టరేట్ వద్ద రహదారిపై బైఠాయింపు
- పోలీసుల దురుసు ప్రవర్తన
- బట్టలూడదీసి...రోడ్డుపై ఈడ్చేసి దారుణం
- జీపులో విద్యార్థినులపై చేయి చేసుకున్న వన్‌టౌన్ ఎస్ఐ
- క్రిమినల్ కేసులు పెడతామని బెదిరింపులు

ఎస్ఎఫ్ఐ నాయకులు డి.రాము,భానును బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యారంగ సమస్యలతో పాటు వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులపైనా, ఎస్ఎఫ్ఐ నాయకులపైనా పోలీసులు జులుం ప్రదర్శించారు. ఆందోళన చేస్తున్న విషయం అధికారులకు తెలియజేయాల్సిన పోలీసులు విద్యార్థులపై తమ ప్రతాపం చూపారు. బట్టలూడదీసి జుత్తు పట్టుకొని నడిరోడ్డుపై ఈడ్చుకు పోయారు. 31మందిని అరెస్టుచేసి, సాయంత్రం విడిచిపెట్టారు.

జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అధికారులెవరూ స్పందించి బయటకు రాక పోవడంతో విద్యార్థులు కలెక్టరేట్ ఔట్ గేటు ఎదురుగా రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.రామును డిఎస్‌పి మాట్లాడుదామని పిలిచి రాస్తారోకో విరమించాలని కోరారు. విద్యార్థులతో మాట్లాడి చెబుతానని చెప్పిన రామును బలవంతంగా అరెస్టుకు పాల్పడ్డారు. దీంతో విద్యార్థులంతా అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఐదుగురు ఎస్ఐలు, పదుల సంఖ్యలో పోలీసులు బలవంతంగా రోడుపై రాము షర్ట్‌ను లాగేసి ఈడ్చుకెళ్లి వ్యానులో ఎక్కించారు. దీంతో భగ్గుమన్న విద్యార్థులు ఆ వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నంలో అడ్డంగా బైఠాయించారు. పోలీసులు ఎస్ఎఫ్ఐ నాయకులు రామకృష్ణ, మరి కొంత మంది విద్యార్థినులను బలవంతంగా ఈడ్చుకెళ్ళి అరెస్టు చేశారు. మిగతా విద్యార్థులు వెరవకుండా మరోవైపు ఆందోళన కొనసాగించారు. వారిని లాక్కెళ్లేందుకు మహిళా పోలీసులు నానా తంటాలు పడ్డారు. 'కేసులు పెడతాం, వీరి ఫోటోలు తీయండి, రౌడీల్లా ఉన్నారు.. జుత్తు పట్టుకొని లాగేయండి.. రాకపోతే తన్ని ఎడ్చుకెళ్తాం' అంటూ టూ టౌన్ సిఐ, ఎస్ఐలు విద్యార్థినులను బెదిరించారు. అదనంగా మహిళా పోలీసులను తీసుకొచ్చి రోడ్డు మీద ఈడ్చుకెళ్ళి అరెస్టులకు పాల్పడ్డారు. అంతేకాకుండా వ్యాన్‌లో ఎక్కించిన తరువాత ఎస్ఎఫ్ఐ నాయకురాలు సౌమ్యను వన్‌టౌన్ ఎస్ఐ మురళీ పలుమార్లు కొట్టి బూతులు తిట్టారు. పోలీసుల తీరుపై సౌమ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీకు ఆడ పిల్లలు లేరా? మీ ఆడవాళ్ళతో ఇలాగే మాట్లాడతారా?' అంటూ నిలదీశారు. తాము సమస్యలు పరిష్కారానికి ధర్నా చేస్తే అతిగా వ్యవహరించి అరెస్టులు చేయడం అన్యాయ మన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో మీ పిల్లలు చదివితే కష్టాలు తెలుస్తాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన విద్యార్థులను ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌కు, మరికొందరిని గంట్యాడ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో డి.రాము, ఎం.సౌమ్యతో పాటు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రామకృష్ణ, వి.చిన్నబాబు, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, లావణ్య, భారతి, ఉమా, భాను తదితరులు ఉన్నారు. వీరందరినీ సాయంత్రం వీరందరినీ విడిచిపెట్టారు.

సమస్యలు పరిష్కరించేవరకు పోరాడుతాం

అంతకు ముందు ధర్నాను ఉద్దేశించి జిల్లా సహాయ కార్యదర్శి డి.రాము మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టల్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వాలని, సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల టెక్స్ట్ బుక్స్ అందించి మధ్యాహ్న భోజన వసతి కల్పించాలన్నారు. వియయ నగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం కల్పించాలని, జీవో నెంబర్ 77 రద్దుచేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించాలన్నారు. పెండింగ్ లో ఉన్న విద్య, వసతి దీవెనలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, బాలికల హాస్టల్ లో శానిటరీ ప్యాడ్స్ అందించాలని, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ నాయకులు ఉమాను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్టు అన్యాయం

కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న విద్యార్థులను, ఎస్ఎఫ్ఐ నాయకులను రోడ్లపై ఈడ్చి, బట్టలు చించి అరెస్టులు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ రావు ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ సమస్య చెప్పనీయకుండా అరెస్టులు చేస్తోందని అన్నారు. అరెస్టులు, బెదిరింపులతో ఉద్యమాలను ఆపలేరని అన్నారు.

పోలీసు చర్యలకు సిపిఎం ఖండన

సమస్యల పరిష్కారానికి ఆందోళన చేస్తున్న విద్యార్థులను బట్టలూదీసి ఈడ్చుకుపోవడమే కాకుండా వ్యాన్‌లో ఎక్కించిన తరువాత విద్యార్థినులపై పోలీసులు చేయి చేసుకోవడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. పోలీసు చర్యలను ఆయన ఖండించారు. పోరాటాలపై నిర్బంధాలు ప్రయోగించడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రహదారిపై బైఠాయించిన విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ నాయకురాలు భారతిని రహదారిపై ఈడ్చేస్తున్న పోలీసులు

ఏరియా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న జ్వరపీడితులు

విజృంభిస్తున్న జ్వరాలు

రోగులతో ఏరియా ఆస్పత్రి కిటకిట ● 50శాతం జ్వర పీడితులే

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎస్.కోట ఏజెన్సీ ప్రాంతంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. రోగులతో ఏరియా ఆస్పత్రి కిటకిటలాడుతోంది. ఆస్పత్రికి రోజువారి వస్తున్నరోగుల్లో సగం మంది జ్వరపీడితులే ఉంటున్నారు. ముఖ్యంగా ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు రక్త హీనత, రక్తంలో ఇన్‌ఫెక్షన్‌తో జ్వరాల బారిన పడుతున్నారు.

శృంగవరపుకోట మండలంతో పాటు వేపాడ, అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. సాధారణంగా జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు కారణంగా ఏటా జ్వరాలు వస్తుంటాయి. నీటి నిల్వలు వల్ల దోమలు వృద్ధి చెందడం, నీటి బావుల్లోను, చెరువుల్లోను కొత్తనీరు చేరడంతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి జ్వరాలతో ఆస్పత్రులు కిటకిటలాడుతుంటాయి. ప్రస్తుతం అదేపరిస్థితి నెలకొంది. మండలానికి అనుకొని ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని గ్రామాల గిరిజనులు, శృంగవరపు కోట మండలంలోని దారపర్తి పంచాయతీ పరిధిలోగల 12 గ్రామాలు, మూలబొడ్డవర పంచాయతీ పరిధిలో గల నాలుగు గిరిజన గ్రామాలు, కిల్తంపాలెం పంచాయతీ పరిధిలోగల నాలుగు గిరిజన గ్రామాలు, గంట్యాడ మండలం తాటిపూడి డ్యాం అవతల గల నాలుగు గిరిజన గ్రామాలకు చెందిన జ్వర పీడితులు, బ్లడ్ ఇన్‌ఫెక్షన్, రక్తహీనతతో బాధపడతున్న వారు ఎక్కువగా ఆస్పత్రిలో చేరుతున్నారు. పలు ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు జ్వరాలతో ఆస్పత్రిలో చేరి చికిత్సపొందుతున్నారు. జ్వరాలు తగ్గిన తరువాత కూడా కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు.

వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలి : సిపిఎం

గిరిజన గ్రామాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారుల్లో ఎక్కువగా బ్లడ్ ఇన్ఫెక్షన్, రక్తహీనత మలేరియా టైఫాయిడ్ వంటి వ్యాధులతో చేరుతున్నారని తెలిపారు. వీరంతా ప్రభుత్వ పాఠశాలల్లోనూ, ప్రభుత్వ వసతి గహాల్లోనూ చదువుతున్నవారేనని ఆవేదన చెందారు.

చికిత్సపొందుతున్న విద్యార్థినులు

పౌష్టిక ఆహారాన్ని సక్రమంగా అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని పిల్లల రక్తహీనత నుండి బయటపడేలా చూడాలని కోరారు.

ఓపిలో 50శాతం జ్వర పీడితులే

గత మూడు నెలల్లో ఆసుపత్రికి వచ్చే ఓపిలలో 50శాతం మంది జ్వరపీడుతలేనని. వీరిలో అధిక శాతం మంది గిరిజన గ్రామాల నుంచి వచ్చిన వారేనని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలా తెలిపారు. కరోనా తరువాత వర్షాకాలాల్లో వచ్చే సీజనల్ వ్యాధులు వాటి రూపాన్ని మార్చుకుంటున్నాయని తెలిపారు. జ్వరం తగ్గినప్పటికీ కీళ్లనొప్పులు, నీరసం కొద్దిరోజుల పాటు ఉంటున్నాయని అయినప్పటికీ రోగులకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సను అందిస్తున్నామని ఆమె తెలిపారు

నేడు హాకీ, తైక్వాండో జట్ల ఎంపిక పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర స్థాయిలో జరగబోయే అండర్-14 బాల, బాలికల హాకీ, తైక్వాండో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 27న రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజున అండర్- 14, 17 వయసుల విభాగాల్లో తైక్వాండో క్రీడాకారుల ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, సంబంధిత పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు.

జిల్లా తైక్వాండో జట్లు ఎంపిక పూర్తి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కడప జిల్లాలో జరగనున్న రాష్ట్ర అండర్ 19 తైక్వాండో పోటీలకు జిల్లా జట్లు ఎంపిక ప్రక్రియ పూర్తయ్యింది. స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం జరిగిన ఎంపికకు జిల్లా వ్యాప్తంగా వంద మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. 8 మంది బాలురు, 11 మంది బాలికలను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేసినట్లు అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి పివిఎల్ఎన్ కృష్ణ తెలిపారు.

బాలికపై అత్యాచారం

పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలోని లోతుగెడ్డ గ్రామంలో అమానుషం చోటుచేసుకుంది. దళిత బాలికపై అదే గ్రామానికి నలుగురు అత్యాచారానికి పాల్పడ్డారు. ఏడాదిగా జరుగుతున్న ఈ దారుణాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో ఆలస్యంగా వెలుగు చూసింది. ఆంధ్ర పోలీసులు తెలిసిన వివరాలు ప్రకారం. లోతుగెడ్డ దళిత కాలనీకి చెందిన పదో తరగతి విద్యార్థినిని స్థానిక యువకులు కొందరు కొంతకాలంగా లైంగికంగా వేధిస్తున్నారు. బెదిరించి లొంగదీసు కున్నారు. ఏడాది గా ఆ బాలికపై లైంగిక దాడికి పాల్పడుతున్నారు. ఆ బాలిక తల్లిదండ్రులు గొడవలు పడి కొన్నాళ్లుగా విడిగా ఉంటున్నారు. దీంతో, బాలిక అమ్మమ్మ సంరక్షణలో ఉంటోంది. కొద్ది రోజులుగా ఆ బాలిక ప్రవర్తనలో మార్పును అమ్మమ్మ గమనిస్తోంది. ముభావంగా ఉండడం తో అనుమానం వచ్చి అమ్మమ్మ ప్రశ్నించడంతో బాధిత బాలిక విషయాన్ని చెప్పింది. దీంతో, అమ్మమ్మ ఈ విషయాన్ని కులపెద్దలు, గ్రామపెద్దల దృష్టికి తీసుకు వెళ్ళగా, వారు ఆ నలుగురు యువకుల తల్లిదండ్రులకు చెప్పి హెచ్చరించారు. బాధితురాలు రెండ్రోజుల క్రితం ఆంధ్ర పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బొబ్బిలి డిఎస్‌పి శ్రీధర్, సిఐ అప్పలనాయుడు మంగళవారం దర్యాప్తు చేపట్టారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించి, నివేదిక వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిందితులైన నలుగురు యువకులు కూడా 16 సంవత్సరాల వయసు వారే కావడం గమనార్హం. పోలీసుల అదుపులో ముగ్గురు వుండగా,. ఒకరు పరారీలో ఉన్నారు.

రహదారుల మరమ్మతులు పూర్తి చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లమ్మ జాతరలో సిరిమాను తిరిగే ప్రాంతంలో రహదారుల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీరాములనాయుడు ఆదేశించారు. మంగళవారం హుకుంపేట నుండి కోట వరకు సిరిమాను తిరిగే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. హుకుంపేట నుండి సిరిమాను బయలుదేరే సమయం నుండి కోట వరకు ఉన్న రహదారి మరమ్మత్తుల యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని చెప్పారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించాలని పారిశుధ్య సిబ్బందికి ఆదేశించారు. లీకులను సరిచేసి నీటి పంపిణీకి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఇఇ శ్రీనివాసరావు, డిఇ అప్పారావు, పారిశుధ్య పర్యవేక్షకులు బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

బోధన మెరుగుపడకపోతే చర్యలు : డిఇఒ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఉపాధ్యాయులు అభ్యాసన, బోధనలో మెరుగు పర్చుకోక పోతే తీవ్ర చర్యలు తీసుకుంటామని డిఇఒ బి. లింగేశ్వర రెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక రామతీర్థం జంక్షన్ ఎంపిపి పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల ఆంగ్లం అభ్యాసనపై పలు ప్రశ్నలు వేశారు. అయితే విద్యార్థి సారిగా చెప్పలేకపోవడంతో డిఇఒ సంబంధిత ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరికొంత మంది విద్యార్థులను అడిగినా ఇదే పరిస్థితి కనిపించడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన ప్రభుత్వం ఇన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా ఉపాధ్యాయులు అభ్యాసన, బోధనలలో నిర్లక్ష్యం వహించడం భావ్యం కాదని, తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఇఒ యు. సూర్య నారాయణ మూర్తి, డైట్ ప్రిన్సిపాల్ ఎన్‌టి నాయుడు పాల్గొన్నారు.

అక్టోబర్ 15 తర్వాత విధులు బహిష్కరణ : సిఐటియు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే వచ్చే నెల 15 తరువాత విధులు బహిష్కరిస్తామని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్ రావు హెచ్చరించారు. మంగళ వారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీల అమలు చేయకుండా తీవ్ర ద్రోహం చేస్తుందన్నారు. శాంతియుత నిరసనలకు అనుమతించకుండా నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతగా ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చాక ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించి పరిష్కరించకపోతే కలిసి వచ్చే సంఘాలతో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. స్థానికంగా 4సంవత్సరాల నుంచి మున్సిపల్ కార్మికులకు సబ్బులు, నూనెలు, చెప్పులు యూనిఫామ్ వంటి రక్షణ పరికరాలు ఇవ్వడం లేదన్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన తుపాకుల రమణమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల ఆర్థిక సహాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ కి వినతి పత్రం ఇచ్చామని, వచ్చే నెల 4న నగర పంచాయతీ పెద్దలను కలుస్తామని, అక్టోబర్ 15 లోపు అధికారులు, పాలకవర్గం స్పందించకపోతే విధులను బహిష్కరించాల్సి వస్తుందని, అందుకు కార్మికులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నగర పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి బాబురావు నాయకత్వంలో జరిగిన ధర్నాలో లక్ష్మి, దుర్గారావు, హరిబాబు, సురేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

500 మందికి వైద్య సేవలు

జగనన్న ఆరోగ్య సురక్షకు స్పందన

ప్రజాశక్తి-మెంటాడ

ఇంటింటికీ వైద్య సేవలను అందించేందుకు ఉద్దేశించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజలనుంచి విశేష స్పందన లభించింది. పిట్టాడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పైలట్ ప్రాజెక్టుగా మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి 502 మంది రోగులు హాజరయ్యారు. వైద్య పరీక్షలను చేయించుకొని, మందులు తీసుకున్నారు. పిట్టాడ వానిజ, కారుమామిడివలస, రాయవలస, మిర్తివలస తదితర గ్రామాల్లో ఇంటింటి సర్వేతోపాటు విస్తత ప్రచారం చేసి, రోగులు శిబిరానికి హాజరయ్యేందుకు వీలుగా వాహన సదుపాయం కూడా కల్పించారు. వైద్య శిబిరం వద్ద స్థానిక పిహెచ్‌సి డాక్టర్ ఎం.శృతితో, చల్లపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంజనా రాణితో పాటు మరో ఆరుగురు స్పెషలిస్టు వైద్యులను అందుబాటులో ఉంచారు. ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ శోభాదేవి, సాధారణ వైద్య నిపుణులు డాక్టర్ గౌతమ్, డాక్టర్ సునీల్‌కుమార్, శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ సౌమిత్, ఇఎన్‌టి నిపుణులు డాక్టర్ రామకృష్ణరాజు, ఎస్‌పిఎం డాక్టర్ టి.కావ్యశ్రీ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చిన్నపిల్లలకు డిసిహెచ్ఎస్ డాక్టర్ గౌరీ శంకర్ వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో 14 రకాల పరీక్షలను నిర్వహించారు. దాదాపు 105 రకాల మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేయనున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. వైద్యులు, రోగులతో మాట్లాడి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యం కోసం ఉత్తమ సేవలందిస్తున్న 13 మంది క్లాప్ మిత్రాలను కలెక్టర్ నాగలక్ష్మి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్, డిపిఒ నిర్మలాదేవి, బొబ్బిలి ఆర్‌డిఒ శేషశైలజ, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్రావు, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ భాస్కరరావు, 108 జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అప్పలరాజు, ఎంపిపి రెడ్డి సన్యాశినాయుడు, తాశిల్దార్ రామకష్ణ, ఎంపిడిఒ త్రివిక్రమరావు, సిడిపిఒ నాగమణి, సర్పంచ్ కె.నాయుడుబాబు, రెడ్డి రాజప్పలనాయుడు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఉత్తీర్ణతకోసం విద్యార్థులను దత్తత తీసుకోవాలి

పదో తరగతి విద్యార్థులను ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఒక్కొక్కరూ ఐదుగురిని దత్తత తీసుకొని, వారిని బాగా చదివించి టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణులు చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. జిటి పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. స్వయంగా రుచిని పరీక్షించారు. విద్యార్థులతో మాట్లాడి, ఉపాధ్యాయుల బోధనా పద్దతిపై ఆరా తీశారు. రక్తహీనత ఉన్న విద్యార్థుల గురించి ఆరా తీశారు. ఐరన్ మాత్రలను తప్పనిసరిగా వాడాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదోతరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, అందుకు తగిన కార్యాచరణను అమలు చేయాలన్నారు. ఐదుగురు విద్యార్థుల బాధ్యతను ఒక ఉపాధ్యాయుడికి అప్పగించి, వారిని చదివించి, ఉత్తీర్ణులు చేసే బాధ్యత అప్పగించాలని ఎంఇఓలు, హెచ్‌ఎంకు కలెక్టర్ సూచించారు.

వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా తిరుమల-మెడికవర్ ఆధ్వర్యాన 29న ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రపంచ హృదయ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 29న తిరుమల మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామని ఆసుపత్రి నిర్వహకులు డాక్టర్ కె. తిరుమల ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 29న ఉదయం కోట నుంచి ర్యాలీ ప్రారంభమై తిరుమల మెడికవర్ ఆసుపత్రి వరకూ సాగుతుందన్నారు. ర్యాలీని జిల్లా ఎస్పీ. దీపికా పాటిల్ ప్రారంభిస్తారని తెలిపారు. ర్యాలీ అనంతరం గుండె జబ్బులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై ఆసుపత్రి సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. మెడికవర్ ఆసుపత్రి వారు హార్ట్ సేవర్స్ సిపిఆర్ శిక్షణ కార్యక్రమాలు దేశ వ్యాప్తంగా నివసిస్తున్నారని, ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి ఇస్తున్న ఈ శిక్షణ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోజు ఉదయం 7 గంటలకు ఆసుపత్రి కింది అంతస్తులో జిల్లా వాసుల కోసం ఉచిత గుండె తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డాక్టర్ తిరుమల ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆసుపత్రి ఇంటెన్సివ్ వైద్య నిపుణులు డాక్టర్.పి.ఎస్.వి. రామారావు, గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎ. శరత్ కుమార్ పాత్ర, డాక్టర్ సిహెచ్ మహేష్, ఆసుపత్రి సెంటర్ హెడ్ వివిఎస్.పద్మ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు హెల్త్ కార్డులు జారీ

తిరుమల మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం వర్కింగ్ జర్నలిస్టులకు ప్రివిలేజ్ హెల్త్ కార్డ్స్ ను జారీ చేసింది. ఆసుపత్రి ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జర్నలిస్టులకు ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధులు డాక్టర్ తిరుమల ప్రసాద్ చేతుల మీదుగా 165 మంది జర్నలిస్టులకు హెల్త్ కార్డులను అందజేశారు. ఈ కార్డుల ద్వారా ప్రత్యేక ప్రాధాన్యత, రాయితీ ఉంటుందని డాక్టర్ తిరుమల ప్రసాద్ తెలిపారు. ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు ఎం.ఎం.ఎల్.నాయుడు, కె.రమేష్‌నాయుడు, పంచాది అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ ప్రతినిధి ఎంఎంఎల్ నాయుడుకు హెల్త్‌కార్డు అందిస్తున్న డాక్టర్ తిరుమల ప్రసాద్

రాష్ట్ర కమిటీలో ఇద్దరికి చోటు

రామమూర్తి

జగన్నాథం

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన రాష్ట్ర కమిటీలో బొబ్బిలి నుంచి ఇద్దరికి స్థానం లభించింది. రాష్ట్ర సహ అధ్యక్షులుగా రౌతు రామమూర్తి, రాష్ట్ర కార్యదర్శిగా లచ్చుపతుల జగన్నాథం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడలో ఈనెల 25, 26న జరిగిన రాష్ట్ర సమావేశాల్లో నూతన కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో స్థానం సాధించిన రామమూర్తి, జగన్నాధంలకు బొబ్బిలి తాలుక అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, సభ్యులు శుభాకాంక్షలు చెప్పారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

బొబ్బిలి: పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. మున్సిపాలిటీలోని 17వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బేబినాయన పరామర్శ

బొబ్బిలి: స్థానిక గ్రోత్ సెంటర్ ఎస్సార్ పెట్రోల్ బంకులో డీజిల్ ట్యాంకు శుభ్రం చేసేందుకు దిగి మరణించిన చింతాడ గ్రామానికి చెందిన పెద్దింటి పోలినాయుడు కుటుంబ సభ్యులను మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన పరామర్శించి ఓదార్చారు. ప్రమాదానికి గల కారణాలను పోలీసులను, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఆయనతో టిడిపి మాజీ మండల అధ్యక్షులు అప్పలనాయుడు, తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటడం ద్వారా గట్లకు రక్షణ

నెల్లిమర్ల: చెరువు గట్ల పై మొక్కలు నాటడం ద్వారా ఆయా చెరువులకు రక్షణ కలుగుతుందని సర్పంచ్ రేవల్ల శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం సతివాడ గ్రామంలో అనంత సాగరం, జగ్గ సాగరం చెరువు గట్లపై కొబ్బరి, మామిడి, జామ, కమల పండ్ల మొక్కలను గ్రామ సర్పంచ్ రేవల్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్యన్నారాయణ, వైస్ సర్పంచ్ చందక విశ్వనాధం పాలక వర్గం నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపిటిసి మాట్లాడుతూ చెరువు గట్ల పై మొక్కలు నాటడం ద్వారా చెరువులకు రక్షణ కలుగుతుందని, తద్వారా భారీ వర్షాలు కురిసినప్పుడు చెరువులకు గండ్లు పడకుండా ఉంటాయని పేర్కొన్నారు. కాగా గ్రామ పంచాయితీ తరపున 120 కొబ్బరి మొక్కలు, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ తరపున మామిడి, జామ, కమల, చింత తదితర రకాల 500 మొక్కలు పంపిణీ చేశారు.

సైన్సు సముదాయ పాఠశాల ప్రారంభం

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ పి.బాల భాస్కరరావు సైన్స్ సముదాయ పాఠశాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సైన్స్ పాఠశాల సముదాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్, సిఆర్‌పిలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లైవ్ ఓరిటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు.

గ్రామ సచివాలయం పరిశీలన

వేపాడ: మండలంలోని సోంపురం సచివాలయాన్ని ఎంపిడిఒ పట్నాయక్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే, ఎస్ డిజి సర్వే, సిఆర్ యాప్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ ఎం. గంగరాజు, ఎంపిటిసి, కార్యదర్శులు నాగమణి, యశోద, వీణా, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సకాలంలో సేవలందించండి

వంగర: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఎంపిడిఒ హెచ్. శశిభూషణరావు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల కేంద్రంలో గల సచివాలయాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు పట్టికతో పాటు మిగతా రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులంతా సమయ పాలన పాటించాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఆప్తమాలజిస్ట్ సన్యాసమ్మ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రెల్లివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రాజ్ కుమార్ పరిశీలించారు. విద్యార్థుల కంటి పరీక్షలపై ఆప్తమాలజిస్ట్ సన్యాసమ్మని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని ప్రజల ఆరోగ్య సమస్యలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలు డేటా కచ్చితంగా ఉంటే సరియైన వైద్యం అందించగలమని సిబ్బందికి తెలిపారు. ఆయనతోపాటు పిహెచ్‌సి ఆరోగ్య పర్యవేక్షకులు టివిఎస్ వర్మ, ఎఎన్ఎంలు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు పంపిణీ

గరివిడి : చీపురుపల్లి పట్టణంలోని జెడ్‌పిటిసి క్యాంపు కార్యాలయంలో అర్హులైన పేదలకు మంగళవారం వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. 5వ సచివాలయం పరిధిలో లబ్దిదారులకు నూతన రైస్ కార్డులను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు పతివాడ రాజారావు, నాయకులు కోరుకొండ దాలయ్య, శివాలయం డైరక్టర్ ప్రభాత్ కుమార్, అడ్డురి రామకృష్ణ, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

విజయనగరం టౌన్ : విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించేందుకు సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 20నుంచి చేపట్టిన బైక్‌యాత్ర ముగింపు సందర్భంగా వచ్చేనెల 5న విశాఖ కూర్మన్న పాలెం వద్ద జరుగనున్న బహిరంగ సభను జయప్రదంచేయాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు కోరారు. మంగళవారం మార్కెట్ కలాశీల వద్ద జరిగిన ప్రచార సభ లో కరపత్రం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. 32మంది ప్రాణ త్యాగాలు, వీరోచిత పోరాటంతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రంలో బిజెపి కుట్ర పన్నుతుందన్నారు. కార్యక్రమంలో సిఐటియూ నగర కార్యదర్శి బి.రమణ, మేస్త్రి బంగారప్పుడు, గౌరీ, పాల్గొన్నారు.

సన్ రైజ్ స్కూల్ విద్యార్థుల సేవా దృక్పథం

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం, మెరకముడిదాం గ్రామాల మధ్య ఉన్న సన్ రైజ్ పాఠశాల విద్యార్థులు తమ సేవా దృక్పధాన్ని చాటుకున్నారు. మంగళవారం మెరక ముడిదాం గ్రామంలో గల తాడేల వీధిలో నివసిస్తున్న పేద కుటుంబానికి చెందిన మండల వెంకటనాయుడు కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. ఈ విధంగా చేయటం వల్ల విద్యార్థులలో నైతిక విలువలు, సేవా దృక్పధాన్ని, పెద్దలుపాలిట గౌరవం కలిగి ఉంటారని పాఠశాల ఛైర్మన్ నాగరాజు, కరెస్పాండెంట్ అరుణ కుమారి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలపై లైంగిక వేధింపులు అరికట్టాలి

రామభద్రపురం: బాలికలపై లైంగిక వేధింపులు అరికట్టాలని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడువలసలో బాలికల సంరక్షణ కోసం నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు మాట్లాడుతు బాలికలు లైంగిక వేధింపులు గురైనప్పుడు, అపరిచితులు శరీర భాగాలు తాకినప్పుడు గట్టిగా అరవాలని, అక్కడ నుండి పరుగెత్తాలని, ఇంటిలో పెద్దవాళ్లకు చెప్పాలని అవగాహన కల్పించారు. మంచి స్పర్శ, చెడు స్పర్శకు తారతమ్యాలను బాలికలకు వివరించారు. బాలికలు లైంగిక వేధింపులకు గురైనప్పుడు చైల్డ్‌లైన్ నెంబర్ 1098, 100 లేదా 101కి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణు, కృష్ణం నాయుడులు పాల్గొన్నారు.

సమస్యల్లోనే 'ఆదర్శం'

- మోడల్ స్కూళ్లలో సమస్యలు వెల్లువ
- అక్కివరం పాఠశాలకు ప్రహరీ సమస్య
- బక్కునాయుడుపేట గురుకుల పాఠశాలదీ ఇదే పరిస్థితి

డెంకాడ, వేపాడ మండలాల్లో ఉన్న ఆదర్శ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు సమస్యలతో సతమతమవుతున్నాయి. ఒక్కో పాఠశాలలో ఒక్కో సమస్యతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. డెంకాడ మండలంలోని అక్కివరం మోడల్ పాఠశాలకు ప్రహరీ, నైట్ వాచ్‌మెన్ లేక పశువులు, పాములు స్కూల్లోకి వచ్చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వేపాడ మండలం బక్కునాయుడుపేట వద్ద సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సిబ్బందికి వేతనాలు సకాలంలో అందక అవస్థలు పడుతున్నారు. భవనాలకు కిటికీలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

వేపాడ: కిటికీలకు డోర్లు లేని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం

ప్రజాశక్తి- డెంకాడ, వేపాడ

డెంకాడ మండలంలోని అక్కివరం ఎపి మోడల్ స్కూల్‌కు ప్రహరీ గోడ, నైట్ వాచ్‌మెన్ లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. పాఠశాలలో 720 మంది విద్యార్థులు ఉన్నారు. అక్కడ ఉన్న వసతి గృహంలో వందమంది విద్యార్థినిలు ఈ పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలలో నైట్ వాచ్‌మెన్ లేకపోవడం కూడా పెద్ద సమస్యగా మారింది. అందరూ ఆడపిల్లలే కావడంతో రాత్రి పూట వారికి రక్షణ ఉండటం లేదన్న విషయం ఆందోళనకు గురి చేస్తోంది. ఈ పాఠశాలలో నైట్ వాచ్‌మెన్ గా వచ్చిన వ్యక్తి వెంటనే డిప్యూటేషన్ పై వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇక్కడ నైట్ వాచ్ మెన్ లేరు. దీంతో హాస్టల్లో ఉన్న విద్యార్థినిలు రాత్రి సమయంలో భయభ్రాంతులకు గురవుతున్నారు.

విలువైన వస్తువులకు రక్షణ కరువు

ఈ పాఠశాలలో విలువైన వస్తువులు కంప్యూటర్లు తదితర సామాగ్రి ఉన్నాయి. ప్రహరీ గోడ, నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో ఉపాధ్యాయులు విద్యార్థులు భయాందోళన గురవుతున్నారు. ఎవరైనా వస్తువులను దొంగిలిస్తే ఎవరు సమాధానం చెబుతారని ప్రశ్నిస్తున్నారు. ఈ పాఠశాలలో ఇంటలెక్ట్ ఎనామిక్ సబ్జెక్టుకి టీచర్ లేరు. పాఠశాలలో, హాస్టల్లోనూ ప్లంబింగ్ పనులకు నిధులు లేకపోవడంతో నిలిచిపోయాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి నైట్ వాచ్మెన్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సిబ్బందికి వేతన కష్టాలు

వేపాడ సచివాలయం పరిధిలోని బక్కు నాయుడుపేట వద్ద బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో పనిచేస్తున్న కొంతమంది టీచర్లకు, నాన్ టీచింగ్ సిబ్బందికి, సిఆర్‌టిలకు జూలై నెల నుండి నేటి వరకు జీతాలు అందలేదు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని చెబుతున్నారు. విద్యా శాఖలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, సిఆర్‌టిలు కూడా జీతాలు అందక అవస్థలు పడుతున్నారు. ప్రతి నెల జీతాలు సకాలంలో అందకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని పలువురు ప్రశ్నిస్తున్నారు.

డార్మెటరీ కిటికీలకు రెక్కలేవి..?

సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో విద్యార్థులకు నిర్మించిన డార్మెటరీ గదులకు ఉన్న కిటికీలకు అమర్చిన రెక్కలు పాడైపోవడం వల్ల దోమలతో పాటు, ఈగలు, ధూళి కూడా లోపలికి చొరబడి ఎండ వల్ల వచ్చే వేడిగాలితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వసతి గృహానికి నాడు నేడు నిధులు మంజూరైనప్పటికీ పూర్తిస్థాయిలో పనులు చేయలేదు. తూతూ మంత్రంగా పైపై మెరుగులు దిద్ది బిల్డింగులకు రంగులు వేయడం తప్ప విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా కిటికీలకు రెక్కలు అమర్చకపోవడం దురదృష్టకరమంటూ విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వసతి గృహంలో ఉపాధ్యాయులు విద్య బోధనలో లోపాలు లేకపోయినప్పటికీ విద్యార్థులు రాత్రి పూట నిద్రించే గదుల్లో కిటికీలు లేకపోవడం వల్ల వచ్చే దోమలు, వర్షం వచ్చినప్పుడు వలుపురు, చలిగాలులతో ఇబ్బందులు పడుతున్నారు. కాగా రానున్న చలికాలంలో మరింత ఇబ్బంది పడే పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు. అధికారులు స్పందించి కిటికీలకు రెక్కలు అమర్చి వసతి గృహంలో నివసిస్తున్న విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డెంకాడ: ప్రహరీ లేని అక్కివరం ఆదర్శ పాఠశాల

పైశాచిక ఆనందం కోసమే చంద్రబాబు అరెస్ట్

ప్రజాశక్తి- బొబ్బిలి

పైశాచిక ఆనందం కోసమే చంద్రబాబును వైసిపి ప్రభుత్వం అరెస్టు చేసిందని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా బొబ్బిలిలో 14వరోజు దీక్షలు మంగళవారం కొనసాగాయి. దీక్షా శిబిరంలో బేబినాయన, తెంటు రాజా కూర్చుని నిరసన తెలిపారు. దీక్షలకు జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి, నియోజకవర్గ ఇంచార్జి జి.అప్పలస్వామి, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి బాబ్జీ మద్దతు ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శృంగవరపు కోట: పట్టణంలోని దారగంగమ్మ ఫంక్షన్ హాల్ ఆవరణలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి వర్గం ఆకుల డిపో వద్ద గొంప కృష్ణ వర్గాలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 14వ రోజు కొనసాగాయి. గొంప కృష్ణ నిర్వహిస్తున్న శిబిరం వద్ద చంద్రబాబును విడుదల చేయాలంటూ అర్ధ నగ్నంగా ప్రదర్శించారు. మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి దీక్షలో నియోజకవర్గంలోని 250 మంది టిడిపి నాయకులు, కార్యకర్తలు సంతకాలు చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి జనసేన జిల్లా ప్రచార కమిటీ సభ్యులు పెదిరెడ్ల రాజశేఖర్, జనసేన పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు.

విజయనగరం : బైక్ ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

భారీగా బైక్ ర్యాలీ

విజయనగరం కోట: టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు మంగళవారం ఉదయం రామతీర్థం దేవస్థానం నుంచి బైక్ ర్యాలీ చేపట్టారు. నెల్లిమర్లలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపి, అక్కడి నుండి విజయనగరం పట్టణంలో పూల్‌బాగ్ కోలనీ రోడ్డు, అంబటిసత్రం, మూడు లాంతర్లు, గంటస్తంభం, కన్యకాపరమేశ్వరి కోవెల, రైల్వే స్టేషన్ రహదారి మీదుగా పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాకు బైక్ ర్యాలీ చేరుకుంది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

మేము సైతం బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా మంగళవారం తోట పాలెంలోని విజ్ఞాన్ జూనియర్ కాలేజ్, ఎంఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో మాజీ ఎమ్మెల్యే మీసాల గీత విద్యార్థులతో సంతకాల సేకరణ, పోస్ట్ కార్డులు పై సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి టి. రమణ, మాడిమి దేవేంద్రనాథ్, కెల్ల సూరిబాబు, మాడుగుల భాను ప్రకాష్, చిప్పాడ మణికంఠ స్వామి, అంబల్ల సూర్య ప్రకాష్, మీసాల సూరిబాబు, గోగుల రమేష్, చందక రాజు, చందక సూరప్పుడు, రవి, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

గరివిడి: చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా చీపురుపల్లిలో మంగళవారం వెదుళ్ళవలస గ్రామ టిడిపి నాయకులు నిరాహార దీక్ష చేశారు. ఈ దీక్షలను చీపురుపల్లి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ కిమిడి నాగార్జున ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెదుళ్ళవలస టిడిపి నాయకులు మన్నెపురి సూర్యనారాయణ, శ్రీదేవి, నెమ్మది విశ్వనాధం, నెమ్మది రామారావు, కిరాల గౌరీనాయుడు, నెమ్మది శివ, కిరాల సూర్యనారాయణతో పాటు మండల నాయకులు పైల బలరాం, సారేపాక సురేష్ బాబు, జనసేన నాయకులు తుమ్మగంటి సూరినాయుడు, విషినిగిరి శ్రీనివాసరావు, సాసుబిల్లి రాము నాయుడు, పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో స్వచ్ఛత, పరి శుభ్రతపై అవగాహన కల్పించాలని కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ సూచించారు. మంగళ వారం స్వచ్ఛత హై సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో ముగ్గులు వేయడం, లక్ష్మి దేవి పేట చెరువు వద్ద పరిసరాలను శుభ్రం చేయడం, చెరువులో చెత్త చెదారాలు తొలగించటం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పంచాయతీ వాసులకు స్వచ్ఛత, పరి శుభ్రత పై మరింత అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమా భాస్కర్, శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డును శుభ్రం చేస్తున్న కమిషనర్, తదితరులు

ఆరు పోలింగ్ కేంద్రాలు మార్పు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నియోజకవర్గంలో ఆరు పోలింగ్ కేంద్రాలను మార్పు చేస్తున్నట్లు ఇఆర్ఒ ఎం. నూకరాజు తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో ఎలక్ట్రోల్ రిటర్నింగ్ అధికారి రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో 205 ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు గాను 6 కేంద్రాలు మార్పు చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నెల్లిమర్లలో 1, డెంకాడలో 1, పూసపాటిరేగలో 4 కేంద్రాలు మార్పు చేస్తున్నామన్నారు. టిడిపి నాయకులు ఓటర్ల జాబితా సవరణలో తేడాలు ఉన్నాయని, బిఎల్ఒలు ఇంటిట సర్వేకి బిఎల్ఎలు ఆయా పోలింగ్ కేంద్రాల్లో చేసిన సర్వేకు తేడాలున్నాయని వాటిని సవరించాలని ఇఆర్ఒ దృష్టికి తీసుకు వెళ్ళారు. అయితే దీనిపై ఇఆర్ఒ స్పందిస్తూ ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని వచ్చే నెల 17న తుది జాబితా ప్రచురణ జరిగిన తర్వాత సవరణలుంటే సరి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎఆర్ఒ డి. ధర్మ రాజు, వైసిపి నాయకులు సముద్రపు రామారావు, టిడిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు కంది చంద్ర శేఖర్ రావు, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, డెంకాడ మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పల నారాయణ, పార్ల మెంటు కార్యదర్శి లెంక అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాయకులతో మాట్లాడుతున్న ఇఆర్ఒ నూకరాజు

అంగన్‌వాడీల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం-1లో పూసపాటిరేగ సెక్టార్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ దంతులూరి బుచ్చి బంగారమ్మ (శశి) జన్మదినోత్సవం సందర్భంగా మండలంలోని అంగన్వాడీలంతా కలిసి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. బంగారమ్మను పూలమాలతో సత్కరించి, ఆమె సేవలను కొనియాడారు. మండలంలోని అంగన్వాడీలందరికీ సహాయ సహకారాలు అందించి అందరి మన్ననలు పొందు తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1995 నుండి ఇసిఇ కార్యకర్తగా పనిచేశానన్నారు. అనంతరం 2002 సంవత్సరంలో భోగాపురం ఐసిడిఎస్ సెక్టర్ ఏర్పాటు కావడంతో తమను అంగన్వాడీలుగా విధులు నిర్వహించేందుకు నియమించారన్నారు. సుమారుగా 30 సంవత్సరాలు పాటు పిల్లలకు విద్యను అందించడం సంతృప్తికరంగా ఉందన్నారు. తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడి టీచర్లందరూ పాల్గొన్నారు.

బంగారమ్మను సత్కరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సేవకు నిర్వచనం 'ఛారిటబుల్ ట్రస్ట్'

ప్రజాశక్తి - కొత్తవలస

వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందజేసి వారిలో మనోధైర్యాన్ని పెంపొందిస్తూ, వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్ట్ సేవలు సేవకే నిర్వచనమని లీడర్ పత్రిక ఎడిటర్ వి.వి.రమణమూర్తి కొనియాడారు. మండలంలోని మంగళపాలెంలో మంగళవారం నిర్వహించిన గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ 25వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మారుమూల గ్రామంలో 25 ఏళ్ల పాటూ సుమారు 2లక్షలకు పైగా కృత్రిమ ఉపకారణాలను వికలాంగులకు ఉచితంగా అందజేసి, వారి స్వయం ఉపాధికి, వికలాంగుల అభ్యున్నతి కోసం జగదీశ్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలను రమణమూర్తి అభినందించారు. ఈ ట్రస్ట్‌ను ఆదర్శంగా చేసుకుని ప్రతి ఒక్కరూ అంకితభావంతో ఎదుటివారికి సహాయపడాలని పిలుపునిచ్చారు.

వికలాంగులకు కృత్రిమ అవయవాలను అందిస్తున్న రమణమూర్తి

అనంతరం పలువురు వికలాంగులకు ఆయన చేతులమీదుగా కృత్రిమ కాళ్ళు, చేతులు, చెవిటి మిషన్లు, బ్లైండ్ స్టిక్స్, వృద్ధులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్, విశ్రాంత రైల్వే ఉద్యోగి స్వామి, లీడర్ ప్రతినిధి ఎల్. శివకుమార్, ట్రస్ట్ వైస్ ఛైర్మన్ ఫణీంద్ర, గురుదేవ హాస్పటల్స్ సిఇఒ అచ్యుతరామ్మయ్య, డాక్టర్ రాఘువేంద్ర, డాక్టర్ సుజాత, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పక్కగా ఇంటింటి సర్వే

ప్రజాశక్తి - కొత్తవలస

జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింట సర్వే పక్కగా నిర్వహించాలని వియ్యంపేట పిహెచ్‌సి డాక్టర్ గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం పిహెచ్‌సి పరిధిలో గల 8 సచివాలయాలలో ఎఎన్ఎమ్, ఆశ వర్కర్స్, వాలంటీర్లు ఇంటింటికి జగనన్న సురక్ష సర్వే చేశారు. ప్రతి ఒక్కరికీ బీపీ, షుగర్, హెచ్.బి. మలేరియా, డెంగీ, టీబీ, కఫం, పరీక్షలు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ప్రతీ గర్భిణి, బాలింత, కిషోర్ బాలికలు, థైరాయిడ్ రోగులకు పరీక్షలు చేసి మెగా వైద్య శిబిరానికి వచ్చేటట్లు టోకెన్స్ ఇచ్చి వైద్య శిబిరం జరిగే స్థలం, తేదీ, సమయం అందరికి తెలిసేటట్లు ప్రచారం చేయాలన్నారు.

ఈ నెల 30న ముసిరాంలో జగనన్న సురక్ష మెగా వైద్య శిభిరం జరుగుతుందని, ఈ క్యాంపుని అందరూ విజయవంతం చేయాలనీ కోరారు. సర్వేలు సక్రమంగా జరిగేటట్లు సూపర్‌వైజర్లు మానిటరింగ్ చేసి సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ జగదాంబ, ఎమ్‌పిహెచ్ఇఒలు నరసింహారావు, తిరుపతిరావు, హెచ్‌వి పద్మావతి, హెచ్ఎస్ ఈశ్వరావులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించటంతో పాటు సంస్థలో ప్రత్యామ్నాయ ఉపాధితో నెలవారీ వేతనం ఇవ్వాలని మీటర్ రీడర్లు డిమాండ్ చేశారు. పట్టణంలోని శ్రీనివాస థియేటర్ ఎదురుగా ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి మీటర్ రీడర్లు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్.కోట సబ్ డివిజన్ విద్యుత్ మీటర్ రీడర్లు ఎం.రాంప్రసాద్, కె.శ్యామ్, ఎం.కోటారావు, కె.రాంబాబు, బి.సత్యనారాయణ, జి.గోపి సంతోష్, శ్రీనివాస్, ఎం.సన్యాసిరావు తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో 3,800 మంది మీటర్ రీడర్లు 10 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్నారన్నారు. గతంలో స్పాట్ బిల్లింగ్ పని 21 రోజులు జరిగేదన్నారు. పని దినాలు క్రమంగా కుదించి 9 రోజులకే బిల్లింగ్ పూర్తి చేయాలని అల్టిమేటం జారీ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లింగ్ పనిదినాలు కుదించటం వల్ల వచ్చే వేతనం తగ్గిపోయి కుటుంబ పోషణ కూడా భారంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల ఒత్తిడి వల్ల బిల్లింగ్ త్వరగా పూర్తి చేయాలనే క్రమంలో అనారోగ్య సమస్యలు కూడా వస్తున్నాయని వెల్లడించారు. ఇప్పటికైనా మీటర్ రీడర్లకు నెల రోజుల పని కల్పించి కనీస వేతనం చట్టబద్ధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మీటర్ రీడర్లలో నాన్ టెక్నికల్‌గా ఉన్న వారికి వారి అర్హతను బట్టి సంస్థలోనే ఉపాధి కల్పించాలని కోరారు.

సత్తా చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి- గరివిడి

చీపురుపల్లి శ్రీ సాయి విద్యానికేతన్ విద్యార్థి బూర్ల రామ చైతన్య కరాటే, వ్యాయామ విద్యలో జిల్లాస్థాయి నుండి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఈ మేరకు మంగళవారం వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అభినందించి దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా హెడ్ కోచ్ శివ, సహాయక కోచ్ కొమరపురి శేఖర్‌ని అభినందించారు. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న రామచైతన్యం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడం శుభపరిణామమన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి తీసుకు రావడానికి కృషి చేయాలన్నారు. ఈ ప్రాంతంలో వున్న విద్యార్థులకు, యువతకు కరాటేలో మంచి శిక్షణ ఇచ్చి తీర్చి దిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివాలయం డైరక్టర్ ప్రభాత్ కుమార్, అడ్డురి రామకృష్ణ, యూత్ లీడర్ డబ్బాడ ఆనంద్, ప్రధానోపాధ్యాయులు గవిడి భారతి, స్కూల్ కరస్పాండెంట్ వలిరెడ్డి పద్మ, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థి ఎంపిక

వంగర: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి దేవకవాడ అశోక్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. రమణమ్మ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈనెల 21, 22 తేదీలలో గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలలో అశోక్ అండర్14 లాంగ్ జంప్ విభాగంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల హెచ్ఎం రమణమ్మ అశోక్‌ను, ప్రత్యేక తర్ఫీదు అందించిన పీడీ కవితను అభినందించారు. జాతీయస్థాయిలో మంచి ప్రతిభ కనబరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

250 మందికి జనసేన కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - భోగాపురం

భోగా పురం గ్రామంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్లను ఆ పార్టీ నాయకులు పల్లంట జగదీష్ మంగళవారం పంపిణీ చేశారు. నెల్లిమర్ల నియోజకవర్గం జనసేన నాయకులు లోకం మాధవి సూచనల మేరకు గ్రామంలోని సుమారు 250 మందికి ఈ కిట్లను పంపిణీ చేసినట్లు జగదీష్ తెలిపారు. క్రియాశీలక సభ్యత్వం ఉన్న జన సేన కార్యకర్తలు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే ఐదు లక్షల రూపాయలు, గాయాల పాలైతే రూ.50వేలు బీమా వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాత నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: కిట్లను అందిస్తున్న జగదీష్

జనసేనలో యువకులు చేరిక

బొబ్బిలి: మండలంలోని కారాడ గ్రామానికి చెందిన యువకులు జనసేనలో చేరారు. జనసేనలో చేరిన యువతకు రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాబు పాలూరి మాట్లాడుతూ బొబ్బిలి నియోజకవర్గంలో జనసేనకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని ఓడించేందుకే ఐక్యంగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు లంక రమేష్, పల్లెం రాజా, అడబాల నాగు, పొట్నూరు జన, చీమల సతీష్, అల్లు రమేష్, జగన్నాధం, జాన్, గార గౌరీ శంకర్, కిలారి అనంత్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల అప్పీలేటు కమీషన్ వారి కోర్టు విజయవాడ
F.A.No.54/2023

Between:
శ్రీరంగా మోటార్స్ ప్రై లిమిటెడ్, విజయనగరం ......అప్పిలెంటు
And:
చోడి నాగరాజు మరియు ఇతరులు .....రెస్పాండెంట్లు

To,
చోడి నాగరాజు S/o (L) అప్పలనాయుడు, ఇంటి నెం. 3-30, ఎగువవీధి, వెంకంపేట, మక్కువ మండలం (మన్యం జిల్లా) విజయనగరం జిల్లా.

పై తెలిపిన అప్పీలు మీకు నోటీసు నిమిత్తము **తేది 30-10-2023** వాయిదా ఉన్నందున ఆ రోజున మీరు ప్రత్యక్షముగా గాని లాయరు గారి ద్వారా గాని హాజరు కావలయును. లేనియెడల ఈ అప్పీలు మీ పరోక్షమున తీర్మానము చేయబడునని ఈ పత్రికా ప్రకటన మూలముగా తెలియజేయడమైనది.

మన్నె హరిబాబు
అడ్వకేటు, విజయవాడ,
సెల్: 9440482681

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT KOTHAVALASA
O.S.No. 179 / 2022

Between:
Smt. Kapu Sarada ... Plaintiff
And:
Smt. Turpati Venkata Lakshmi 2 others ... Defendants

To,
D-1: Smt. Turpati Venkata Lakshmi
W/o. Late T.A.S.Karunakarudu, Hindu, aged 53 years, House Wife, R/o. D.No.4-21, B.C.Colony, Golzam Village, L.Kota Mandal, Vizianagaram District-535161
D-2: Turpati Sunitha
D/o. Late T.A.S.Karunakarudu, Hindu, aged 32 years, -Rest Do-
D-3: Turpati Sai,
S/o. Late T.A.S.Karunakarudu, Hindu, aged 28 years, -Rest Do-

NOTICE

Please take court notice/summons that the above suit is filed against the defendants 1 to 3 who succeeds the estate of the deceased Turpati Appala Sanyasi Karunakarudu, before the Hon'ble Junior Civil Judge Court at Kothavalasa for recovery of money under pro-note dated 10-02-2021 for Rs. 16,00,000/- (Rupees Sixteen Lakhs Only) along with interest thereon. Due to non service of Court Summons all of you i.e. defendants No.1 to 3, Thus, the Hon'ble Court pleased an order to serve the summons/notice under substituted service to the above stated Defendants 1 to 3.

Therefore, hereby, informing you that the above matter is posted to **13-10-2023** for your appearance before the Honourable Junior Civil Judge at Kothavalasa at **10-30 A.M.** If you fail to attend on that day, the matter will be heard and decided exparty.

(By Court Order)
J.V.V.JAGADEESWARA RAO
K.ATCHI BABU, Advocates,
Kothavalasa, Vizianagaram District.
Cell : 9246616118